



కార్యక్రమానికి హాజరైన వివిధ విభాగాల అధికారులు





మేయర్‌కు వినతిపత్రాలను ఇస్తున్న కాలనీవాసులు

ఆంధ్రజ్యోతి వారధిగా ప్రతిధ్వనించిన ప్రజాగళం

ఆంధ్రజ్యోతి అండగా.. చిత్తూరు నగరం సంతపేటలోని విజయలక్ష్మి కాలనీ ప్రజలు తమ సమస్యలపై గొంతు విప్పారు. మంగళవారం ఉదయం విజయలక్ష్మి కాలనీ పీఎన్‌సీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' నినాదంతో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సదస్సులో మౌలిక వసతుల కొరత నుంచీ శాశ్వత సమస్యల దాకా ప్రజాగళం ప్రతిధ్వనించింది.సదస్సుకు హాజరైన స్థానికులు తామెదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. రెండు గంటల పాటు జరిగిన సదస్సులో బాధిత జనం వెతలు విన్న ముఖ్య అతిథులు కార్పొరేషన్ మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ పలు సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన హామీలిచ్చారు. సదస్సుకు హాజరైన కార్పొరేషన్ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకూ, అధికార యంత్రాంగానికీ, ప్రజాప్రతినిధులకూ వారధిగా ఆంధ్రజ్యోతి చేసిన ఈ ప్రయత్నాన్ని అతిథులు అభినందించగా, సదస్సుకు హాజరైన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

- విజయలక్ష్మి కాలనీలో మౌలిక వసతుల కొరతను ప్రస్తావించిన జనం
- పలు అంశాలపై హామీలిచ్చిన మేయర్, కమిషనర్
- విజయవంతంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' సదస్సు

చిత్తూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం సంతపేటలోని విజయలక్ష్మి కాలనీలో మంగళవారం ఉదయం 11గంటలకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సదస్సు ప్రారంభమైంది.ముఖ్య అతిథులుగా మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌లతో పాటు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, 46వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి సురేష్, కార్పొరేటర్ రెడ్డెప్ప, సంతపేట డెవలప్‌మెంట్ కమిటీ సెక్రటరీ భాస్కర రెడ్డి, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.కాలనీవాసులు ఏళ్లతరబడి ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. విజయలక్ష్మి కాలనీ ఏర్పడి 35సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ మౌలిక సదుపాయాలేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను కలిసి విన్నవించినప్పుడల్లా తాత్కాలిక ఉపశమనం కల్పిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు.ఇప్పటికీ మట్టి రోడ్లే వుండడంతో వర్షాకాలంలో బురద మడుగును తలపిస్తుందన్నారు.మురిక్కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో దోమలు ప్రబలి రాత్రిపూట నిద్రపోలేక పోతున్నామని చెప్పుకొచ్చారు. ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని, కాలనీలో జనాబా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. సమస్యలన్నింటినీ కమిషనర్ నోట్ చేసుకున్నారు. చివర్లో సమస్యల పరిష్కారానికి తీసుకోనున్న చర్యల గురించి కమిషనర్, మేయర్ వివరించారు. మరికొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పాంచాలిపురానికి చెందిన రుక్మిణి అనే మహిళ తన ఇంటి పట్టాను రద్దు చేశారని, కూలి పనులతో జీవించే తాను బాడుగ చెల్లించలేక పోతున్నానని కమిషనర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన ఇంటి పట్టాను మంజూరు చేయాలని ఆదేశించారు. బైపాస్‌రోడ్డులో పది కుటుంబాలు నివాసముంటున్నాయని, అక్కడ వ్యర్థాలను వేయడానికి అవసరమైన డంపింగ్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలని మహిళలు కోరగా... తక్షణం ఏర్పాటు చేయాలని ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్‌ను కమిషనర్ ఆదేశించారు. వందమందికి పైగా విజయలక్ష్మి కాలనీ ప్రజలు హాజరైన సదస్సు పరిష్కార దిశగా విజయవంతంగా ముగిసింది. సదస్సులో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఆంధ్రజ్యోతి ప్రజల వెంట ఉంటుందని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు గుర్తు చేస్తూనే ఉంటుందని ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ప్రకటించారు.



రుక్మిణికి ఇంటి పట్టాను మంజూరు చేస్తున్న కమిషనర్



కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

టీడీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి.ఇంకా కొన్ని కాలనీల్లో సమస్యలు ఉన్నాయి. ఈ రోజు ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక .చాలామంది ఇక్కడ సీసీ రోడ్లు, మురికి కాల్వలు, వీధి దీపాలు లేవని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే జగన్మోహన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

- అముద, మేయర్



నెల రోజుల్లో పూర్తి చేస్తా

ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయడం అభినందనీయం. విజయలక్ష్మి కాలనీలో స్థానికులు అనేక సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చారు.మాంసం దుకాణాలతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు.సీసీ రోడ్లు, కల్వర్టులు, మురికికాల్వలు, వీధి దీపాలు కావాలని అడిగారు. వీటిలో కొన్నింటిని నా పరిధిలో ఉన్న నిధులతో నెల రోజుల్లో పూర్తి చేయిస్తా. మిగిలిన పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో నివేదిక తెప్పించుకుని ఎమ్మెల్యేతో మాట్లాడి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటా.

- నరసింహ ప్రసాద్, కమిషనర్

కెంచనబల్లలో మైలారు సందడి

- దేవరెద్దుల పందేలతో జనసంద్రమైన వీధులు



పరుగులు తీస్తున్న ఎద్దులు

రామకుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామంలో మంగళవారం మైలారు పండుగ (ఎద్దుల పరుగు పందేలు) కోలాహలంగా జరిగింది. పండుగను తిలకించేందుకు ఉదయం 6 గంటల నుంచే తరలివచ్చిన జనంతో కెంచనబల్ల వీధులు జనసంద్రంగా మారాయి. ఉదయం గ్రామస్థులు గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవరెద్దులను ఊరేగించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ గిత్తలను బరిలో పరుగులు తీయించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. మొత్తం 244 ఎద్దులు పోటీల్లో పాల్గొనగా రామకుప్పం మండలం గూళిపల్లె సుబ్రహ్మణ్యం ఎద్దు మొదటి స్థానంలో నిలిచింది.బహుమతిగా రూ.10,1116 సుబ్రహ్మణ్యం అందుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం రామనాయకపేట ఆర్‌ఆర్ వాసుకు చెందిన ఎద్దు రెండో స్థానంలో నిలవడంతో రూ.70,001 బహుమతి తీసుకున్నాడు.పోటీల్లో సత్తా చాటిన 50 ఎద్దుల యజమానులకు కూడా బహుమతులు అందించారు.సీఐ మల్లేష్ యాదవ్, ఎస్‌ఐ వెంకటమోహన్ బందోబస్తు నిర్వహించారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రినారాయణాచారి, సతీష్, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, గోవిందప్ప, రమేష్, వీరనాగపురం నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మైలారు పండుగను చూసేందుకు తరలివచ్చిన జనం

రెస్కో చేటిన 'విచారణ' నిర్ణయాలు!

- బయటపెట్టని అధికారులు
- అవకతవకలపై ముగిసిన సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ విచారణ



రెస్కో సిబ్బందిని విచారిస్తున్న విచారణాధికారి శ్రీలక్ష్మి

కుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో)లో వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలపై జరిగిన విచారణ నివేదిక, తద్వారా తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వంనుంచి కుప్పానికి మంగళవారం చేరినట్లు విశ్వసనీయ సమాచారం. నియామకాలు, పదోన్నతులు, టెండరు లేకుండానే కొనుగోళ్లు తదితర అంశాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ నిమిత్తం నియమించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరునెలలపాటు కొనసాగిన విచారణ ముగిసి, ఇప్పుడు ఫలితాలు ఇచ్చే దశకు వచ్చింది.

2019-20 సంవత్సరపు సంస్థ ఆడిట్ నివేదికతో పాటు ఫిర్యాదుల ద్వారా తన దృష్టికి వచ్చిన అవకతవకలు, చేసిన ఆరోపణలతోపాటు పి.మనోహర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు, ఇతర అక్రమాలు, ఆరోపణలు వేటిపైనైనా విచారణ జరిపే అధికారాన్ని అదనపు రిజిస్ట్రార్‌కు ప్రభుత్వం దఖలు పరిచింది. దీంతో రెస్కో బైలా, సర్వీస్ బైలా కాపీలు, 2010 నుంచి చేసిన సవరణల వివరాల తేదీలు, ఆర్డర్లు, లైసెన్సులు, విద్యుత్తు సరఫరా, 2019 నుంచి సంవత్సరాల వారీగా బడ్జెట్, క్యాడర్ స్ట్రెంత్, పదోన్నతులు, జనర్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, ప్రాజెక్ట్ ఇంజనీరు పి.సుబ్రమణ్యం సర్వీస్ వివరాలు, సిబ్బంది జీతభత్యాల పెంపు, గ్రాట్యుటీల చెల్లింపు తదితర సకల వివరాలను కోరిన కె.శ్రీలక్ష్మి, ఆయా ఫైళ్లను తనతోపాటు పట్టుకు వెళ్లారు. ఈ ఏడాది జూలై 18 తొలిసారి కుప్పం రెస్కో కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించారు. రెండోమారు ఆగస్టు 29వ తేదీన ఇక్కడకు వచ్చి విచారణ జరిపారు. మరోవైపు ఎస్పీడీసీఎల్ నుంచి విజిలెన్స్ అధికారులు కూడా దీనికి సమాంతరంగా విచారణ చేశారు. ముఖ్యంగా వాళ్లు రెస్కోలో విద్యుత్తు పరికరాల కొనుగోళ్లు తదితర అంశాలపై దృష్టి పెట్టారు. విజిలెన్స్ విచారణ సైతం రెస్కోలో రెండుసార్లు జరిగింది.

● సిబ్బందిలో హడలు

రెస్కో అవతకవలపై విచారణ ముగిసి, నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు కార్యాలయం చేరాయని ప్రచారం సాగడంతో తమలో ఎవరికి మూడిందోనని ఆ సంస్థ సిబ్బంది హడలి పోతున్నారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి రూ.230 కోట్లు పెండింగులో ఉండడం, ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్‌నుంచి పర్మిషన్ తీసుకోకపోవడం, రెస్కోను ఆదాయ వనరుగా చూడడం, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్ల నష్టాలు రావడం, పదవీ విరమణ చేసిన సి.సుబ్రమణ్యాన్ని నిబంధనలకు వ్యతిరేకంగా ఎండీగా నియమించడం, నిబంధనలను ఉల్లంఘించి కొంతమంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చడం, ఉద్యోగుల అక్రమ నియామకాలు, 2020లో ఒక ఉద్యోగికి నిబంధనలకు వ్యతిరేకంగా సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించడం, అప్పటి ఏడీఈ తన కార్యాలయాన్ని దుర్వినియోగం చేసి, ఏడాది వ్యవధిలో సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీరుగా పదోన్నతి పొందడం వంటి ఫిర్యాదులపై విచారణ కొనసాగింది. ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ వచ్చిన తర్వాత ఎండీగా ఛార్జి తీసుకున్న ఎస్పీడీసీఎల్ ఏడీ సోమశేఖర్ తప్ప, దాదాపు ముప్పావు వంతుపైగా ఉద్యోగులపై వచ్చిన ఏదో ఒక ఆరోపణపై విచారణ కొనసాగింది. ఇప్పుడు విచారణకు సంబంధించి తుది నివేదిక ప్రభుత్వానికి చేరి, అక్కడినుంచి నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు రెస్కో కార్యాలయానికి వచ్చాయని సమాచారం. దీంతో విచారణ నివేదికలో ఎవరు దోషులుగా తేలి ఎవరికి ఏమి మూడిందోనని అధికారులు మొదలుకుని సిబ్బంది మొత్తం హడలి పోతున్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఏమున్నదీ బయటకు చెప్పడానికి అధికారులు ఇష్టపడడంలేదు. విచారణ ఫలితాలపై రెస్కో ఎండీ సోమశేఖర్‌ను అడగ్గా ప్రభుత్వంనుంచి విచారణకు సంబంధించి ఏదో ఫైలు కార్యాలయానికి వచ్చిందన్నారు. అయితే ఏమున్నదో తాను చూడలేదని, వీడియో కాన్ఫరెన్సులో బిజీగా ఉండిపోయానని చెప్పారు. పర్సన్ ఇన్‌ఛార్జి అయిన జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి కానీ, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కానీ, కడా పీడీ కానీ వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

భూతగాదాలతో ఆగిన రైతు గుండె



రమణ

సదుం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణ కారణంగా ఓ వృద్ధ రైతు గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మంగళవారం సదుం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు నడిగడ్డ గ్రామం మాదిగపల్లెకు చెందిన రమణ(60)కు అదే గ్రామానికి చెందిన అగ్రకులాల వారితో కొంత కాలంగా భూతగాదా నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రమణ భూమి దున్నుతుండగా ఇద్దరు గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదాలతో ఘర్షణ ఏర్పడింది. దీంతో రమణ గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అతన్ని కుటుంబసభ్యులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో రమణ భార్య నరసమ్మ, కుమార్తె మమత బోరుమన్నారు. కాగా రమణను అగ్రకులస్థులు కొట్టి చంపారని ఆరోపిస్తూ దళిత సంఘాలు మంగళవారం రాత్రి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగాయి.



ఆకాశంలో కనువిందుచేస్తున్న సూర్యుడి ప్రతిబింబం

సూరీడి సౌందర్యం

నీలి ఆకాశం ఎరుపువర్ణంలోకి మారి చూపరులకు కనువిందుచేసింది. ఒక్కసారిగా ఎరుపురంగులోకి మారిన సూరీడి సౌందర్యాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. బైరెడ్డిపల్లెలో మంగళవారం సాయంత్రం కనిపించిందీ దృశ్యం.

- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి



యువతకు ఉపాధి కల్పించండి

స్థానికంగా ఉన్న యువతకు ఉద్యోగాలు, పనులు లేక గంజాయి, మద్యం వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు కూడా జరగడం లేదు. ఇలాంటి వారికి చిన్నపాటి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారి జీవితాలతోపాటు వారి కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

- జి.మల్లిక



ఇవీ జీవకోన సమస్యలు!

- ఆంధ్రజ్యోతి సదస్సులో వినిపించిన ప్రజాస్వరం
- కమిషనర్, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజల వినతులు

తిరుపతి (వైద్యం, మంగళం), ఆంధ్రజ్యోతి

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ పిలుపునందుకుని పెద్ద సంఖ్యలో జీవకోన ప్రజలు మంగళవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సదస్సుకు హాజరయ్యారు. తిరుపతి కమిషనర్, ఎమ్మెల్యేలకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పరిష్కరించాల్సిందిగా కోరారు. వీరి సమస్యలను సావధానంగా విని, నోట్ చేసుకున్న కమిషనర్ ఎన్. మౌర్య వెంటనే పరిష్కరించగలిగిన మౌలిక సమస్యల గురించి అక్కడే మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దశాబాలుగా ఎదుర్కొంటున్న శాశ్వత సమస్యలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందించారు. పరిష్కారానికి హామీలిచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి అందజేశారు. సదస్సులో జీవకోన వాసులు నివేదించిన సమస్యలు ఇవీ...

శాశ్వత పట్టాలు ఇవ్వండి



జీవకోనలో నివసిస్తున్న వారందరికీ డీకేటీ ఇంటి పట్టాలే ఉన్నాయి. వీటికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇప్పడైనా శాశ్వత పట్టాలు ఇప్పిస్తే ఈ ప్రాంతవాసులకు భద్రత ఉంటుంది.

- సీ.సుబ్రహ్మణ్యం, స్థానికుడు

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా స్మశానం



హిందువుల, ముస్లిం, క్రైస్తవుల సమాధులు ఎక్కడా లేని విధంగా జీవకోనలోని ఒకే చోట ఉన్నాయి. అయితే గంజాయి బ్యాచ్‌కి అడ్డాగా మార్చేశారు. స్మశానాలకు కాంపౌండ్ నిర్మించి, గేట్లు ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

- మహ్మద్ రఫీ, జీవకోన



30 ఏళ్లుగా డీకేటీ లేనా?



నివాస స్థలాలకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాం 30 ఏళ్లకు పైగా నివసిస్తున్న అనేక మందికి ఇప్పటికీ ఇళ్ల పట్టాలు లేవు. కేవలం డీకేటీ పట్టాలతోనే కాలం గడుస్తోంది. అవసరానికి లోన్లు తీసుకునే వీలులేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం శాశ్వత పట్టాలను ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

- శ్రీరాములు, 48వ డివిజన్

గోవిందనగర్‌లో రోడ్లు అధ్వాన్నం



గోవిందనగర్‌లో ఐదేళ్లుగా రోడ్ల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది.

- లక్ష్మి, గోవిందనగర్

మూడేళ్లుగా తాగునీటి సమస్య



అన్నమయ్యనగర్, రాఘవేంద్ర నగర్ ప్రాంతాల్లో మూడేళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్నాం. క్రమం తప్పకుండా నీటి పన్నులు కట్టించుకుంటున్నారు కానీ నీటిని మాత్రం సక్రమంగా సరఫరా చేయడం లేదు.

- ఎం.శకుంతల, అన్నమయ్యనగర్

కపిలతీర్థానికి రోడ్డు వేయండి



జీవకోనం నుంచి కపిల తీర్థంకు వెళ్లాలంటే సత్య నారాయణపురం మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జీవకోన నుంచి ఫారెస్టు భూముల మీదుగా రోడ్డు ఏర్పాటు చేస్తే రెండు నిముషాల్లో కపిలతీర్థంకు చేరుకునే అవకాశం ఉంటుంది.

- ధర్మయ్య, ఉపసర్పంచి

చెక్‌డ్యాం కట్టండి

వానలకు తిరుమల కొండల్లోంచి వచ్చే నీటిని నిల్వ చేసేలా చెక్‌డ్యాం నిర్మిస్తే జీవకోన ప్రాంతంలో ఎటువంటి నీటి సమస్య ఉండదు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయండి.

- శీనివాసయాదవ్, క్రాంతినగర్



వానపడితే రోడ్లు గుంతలవుతున్నాయి



చిన్నపాటి చినుకులు పడినా గోవిందనగర్‌లోని రోడ్లు మడుగులను తలపించేలా మారుతు న్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయంపై అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదు.

- శ్రీదేవి, గోవిందనగం

మూడు నెల్లుగా బర్త్ సర్టిఫికెట్ కోసం..



బర్త్ సర్టిఫికెట్ కోసం మూడు నెలలుగా మీసేవా, మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఎవరూ పట్టించుకోవం లేదు. ఆన్‌లైన్‌లో దేనికి నమోదు చేసుకోవాలన్నా బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్నారు.

- బి.లక్ష్మీ రాఘవేంద్రనగర్

కాలువలు శుభ్రం చేయడం



వారాల తరబడి మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తాచెదారం చేరి దుర్వాసనతోపాటు దోమల సమస్య పెరుగుతోంది. రోగాల బారిన పడాల్సి వస్తోంది. వారానికి రెండు సార్లు కాలువలను శుభ్రం చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- షాజీరా, క్రాంతినగర్

పిట్టగోడలు నిర్మించండి

భారీ కాలువలకు కనీసం పిట్టగోడలు కూడా లేకపోవడం వలన అనేక మంది ప్రమాదవశాత్తు వాటిల్లో పడి మృతిచెందుతున్నారు. ఇటీవల ఐదు మందికి పైగా ఆ ఆ కాలువల్లో పడి మరణించారు. కొంత ఎత్తుగా పిట్ట గోడను నిర్మిస్తే మంచిది.

- రామనాథం, శ్రీరామ్‌నగర్



పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థే



జీవకోనలో పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది.ఎత్తుపల్లాలు ఉండడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకించి లెప్రసీకాలనీలో సమస్యలను పరిష్కరించాలి. ఈప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే సహాయ, సహకారాలు అందించాలి.

- అన్నా సంధ్య, 49వ డివిజన్ కార్పొరేటర్

టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేయాలి



నీటి సమస్య ఎక్కువగా ఉంది. తిరుమల నుంచి ఈ ప్రాంతానికి నీళ్లు వస్తున్నా సమస్య తీరడంలేదు.సత్యనారాయణపురం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.ఓపెన్ డ్రైన్స్ ఉండడం వల్ల చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. జరిమానాలు విధించడం.. ప్రజలను చైతన్యవంతులను చేయడం వల్ల కొంతవరకు నియంత్రించొచ్చు.

- అన్నా అనిత, 48వ డివిజన్ కార్పొరేటర్

ఇళ్లు కట్టుకోలేక ఇబ్బంది



ఇక్కడ నిరుపేదలు ఉంటున్నారు. ఇద్దరేసి కలిసి వాటాలు వేసుకుని 10-15 అంకణాలు కొని, స్థలాన్ని రెండుగా చేసుకుని చిన్నపాటి ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒకేపన్ను రశీదు ఇస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీలోని ఏడున్నర అంకణానికి పన్ను రశీదు మార్చకపోవడంతో ఇళ్లు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు.సమస్యల పరిష్కారానికి 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' చూపుతున్న చొరవ అభినందనీయం.

- పి.కుమారమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

రామకుప్పాన్ని కప్పేసిన పొగమంచు



మంచుదుప్పటి మధ్య రామకుప్పం

రామకుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాంతంలో కొన్ని రోజులుగా వాతావరణం జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. పక్షం రోజులుగా దట్టమైన పొగమంచు కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం ఉష్ణోగ్రత 10నుంచి 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతోంది. ఉదయం 9.30గంటలు దాటినా మంచు తెరలు వీడకపోవడంతో జనం ఇళ్ళకే పరిమితమవుతున్నారు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.ఉదయం 10గంటల తరువాతే జనసంచారం మొదలవుతోంది. సాయంత్రం 4గంటలకు తిరిగి మంచు ప్రతాపం చూపుతుండటంతో వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

పార్టీ ఏదైనా తగ్గేదే లే..!

కుప్పం మండల సచివాలయంలో ఎంపీటీసీ తిమ్మరాయప్ప హవా



కుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో ఎలక్ట్రిక్ స్కూటర్‌కు దర్జాగా ఛార్జింగ్ జరుగుతోంది. మంగళవారం మధ్యాహ్నం కన్పించిన దృశ్యమిది. ఈ స్కూటర్ ఓనర్ మల్లానూరు పంచాయతీ ఎంపీటీసీ తిమ్మరాయన్. ఛార్జింగ్ పెట్టుకుంటున్నది ప్రభుత్వ విద్యుత్తుతో. వైసీపీనుంచి ఎంపీటీసీగా గెలిచిన ఆయన, ఇప్పుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే పార్టీ ఏదైనా ఇలా ప్రభుత్వ కార్యాలయం విద్యుత్తును తన స్కూటర్‌కు వినియోగించడం మాత్రం మానలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎంపీటీసీ తిమ్మరాయన్‌ది ఇదే తీరు. అప్పుడూ ఆయన ఎలక్ట్రిక్ స్కూటర్ ఛార్జింగ్ అవుతూ మండల పరిషత్తు సచివాలయంలోని ఇదే స్థలంలో కనిపించేది. ఇప్పుడు కూడా అదే స్కూటర్, అదే స్థలంలో కనిపిస్తోంది. అంటే పార్టీ ఏదైనా ఎలక్ట్రిక్ స్కూటర్‌కు ప్రభుత్వ విద్యుత్తుతో ఛార్జింగ్ పెట్టుకోవడంలో 'తగ్గేదే లే.' అంటున్నారు ఆ ఎంపీటీసీ. ఇటుచూస్తే మండల సచివాలయం విద్యుత్తు ఛార్జీల బకాయిలు తడిసి మోపెడున్నాయి. తీర్చగలిగే దిక్కులేదు. ఉన్న వ్యయానికి తోడు, ఇటువంటి ఉచిత ఛార్జింగ్‌లు. ఇక విద్యుత్తు దుర్వినియోగం అరికట్టడం ఎవరితరం?.

పొలాల్లో చైన్ స్నాచర్స్ హల్‌చల్

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోనే కాదు పల్లెలకూ చైన్ స్నాచింగ్ పాకుతోంది. జిల్లాలో ఒక్క మంగళవారమే రెండు చోట్ల ఈ తరహా చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల కథనం ప్రకాంర తిరుపతి రూరల్ మండలం కస్తూరికండ్రిగకు చిన్ని ఉదయం పొలంలో ఆవు పాలు పితుకుతోంది. అదే సమయంలో మంకీక్యాంపు ధరించిన ఇద్దరు వ్యక్తులు వచ్చి మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసు, పుస్తెలు లాక్కెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి తెలిపారు. పుత్తూరు అర్బన్ పరిధిలోని వీరపురెడ్డిపాళెం వద్ద వృద్ధ దంపతులు పొలం వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. మంకీ క్యాప్ ధరించిన వ్యక్తులు ఆ మహిళా రైతు వద్దకు వచ్చి నీరు అడిగారు. నీరు ఇచ్చే సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో గొలుసులో కొంతభాగం ఆమె చేతికి చిక్కింది. మిగిలిన భాగాన్ని దొంగలు తీసుకుపోయారని పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

చిత్తూరు విజయలక్ష్మి కాలనీ సమస్యలివే!

ఆంధ్రజ్యోతి సదస్సులో వినిపించిన ప్రజాస్వరం



చిత్తూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ పిలుపునందుకుని చిత్తూరు సంతపేటలోని విజయలక్ష్మి కాలనీ ప్రజలు మంగళవారం ఉదయం పీఎన్‌సీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగిన సదస్సుకు హాజరయ్యారు. మేయర్ అముదకు, కమిషనర్ నరసింహప్రసాద్‌కు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.పరిష్కరించాల్సిందిగా కోరారు. వీరి సమస్యలను సావధానంగా విని, నోట్ చేసుకున్న కమిషనర్ వెంటనే పరిష్కరించగలిగిన మౌలిక సమస్యల గురించి అక్కడే మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శాశ్వత సమస్యలపై మేయర్‌తో కలిసి పరిష్కారానికి హామీలిచ్చారు. సదస్సులో జనం నివేదించిన సమస్యలు ఇవీ...

పన్ను చెల్లించినా ఆన్‌లైన్‌లో చూపించట్లా



మావారు ఆర్మీలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పేరుపై ఉన్న ఇంటిని నా పేరుమీద మార్చుకోవడానికి వెళ్లా. నీటి పన్ను బిల్లు తెస్తేనే మారుస్తామని చెప్పారు. పన్ను చెల్లించి బిల్లుతో పాటు నివాస పన్ను చెల్లించి బిల్లులు ఇచ్చా. అయితే ఆన్‌లైన్‌లో నీటి పన్ను చెల్లించినట్లు చూపించడం లేదు. దాంతో బిల్డింగ్‌ను నా పేరుపై మార్చడం లేదు.

- చంద్రకళ, విజయలక్ష్మి కాలనీ

- స్పందించిన కమిషనర్ ఆర్మీ ఉద్యోగులకు పన్ను చెల్లింపులో మినహాయింపు ఉందని, ఈ వెసులుబాటును ఉపయోగించి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

ఇళ్లలోకి వర్షపు నీరు



సంతపేట అభివృద్ధి కమిటీ ద్వారా రోడ్డు వెడల్పుకు సహకరించాం.రోడ్డు పొడవునా మాంసం దుకాణాలను పెట్టడం వల్ల ఇతరుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. వాటిని తొలగించి ఒకే చోట ఏర్పాటు చేయాలి. ఇందిరానగర్‌లో వర్షం వస్తే మిట్టప్రాంతాల్లోని వర్షపు నీరంతా పల్లపు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయి. సంతపేట మున్సిపల్ హైస్కూల్‌కు 15 ఎకరాల స్థలం ఉంది. విద్యార్థులకు ఉపయోగకరంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

- ద్వారకనాథ్, సంతపేట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

స్కూల్ బస్సులు రావడం లేదు



విజయలక్ష్మి కాలనీ ఎంట్రన్స్ వద్ద కల్వర్టు లేకపోవడంతో కాలనీలోకి స్కూల్ బస్సులు రావడం లేదు. పిల్లలను మెయిన్ రోడ్డు దాకా తీసుకుని బస్సెక్కించి.. సాయంత్రం తీసుకురావాల్సి వస్తోంది.కాలనీలో పలు వీధులు సీసీ రోడ్లు లేక అసంపూర్తిగా వున్నాయి.

- జయశంకర రెడ్డి, విజయలక్ష్మి కాలనీ

పైపులైన్లు, రోడ్లు వేయండి



సురేంద్ర గార్డెన్‌లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వాటర్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీనిపై పలుమార్లు నగరపాలక అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కాలనీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ అందుకు తగినట్లుగా సౌకర్యాలు డెవలప్ కావడం లేదు.

-భాస్కర్, ఆరోగ్యశాఖ రిటైర్డు అధికారి

పదేళ్లుగా తిరుగుతున్నా



పదేళ్లకు ముందు ఇల్లు కట్టుకున్నా. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా.5వ వీధిలో రోడ్డు, మురికి కాల్వలు లేకపోవడంతో రోగాలబారిన పడుతున్నాం.అధికారులు ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించి పుణ్యం కట్టుకోవాలి.

- ముత్యాలశెట్టి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

గ్రంథాలయాన్ని పున: ప్రారంభించాలి



సంతపేట నేషనల్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో మహిళా లైబ్రరీ ఉండేది.భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో లైబ్రరీని రామ్‌నగర్ కాలనీకి తరలించారు. సంతపేటలోనే లైబ్రరీకి భవనాన్ని నిర్మిస్తే నేను ఉచితంగా సేవ చేస్తా.

- మధుబాబు, రిటైర్డు లైబ్రేరియన్

వైసీపీ పాలనలో అప్పుల కుప్పగా రాష్ట్రం

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధిని విస్మరించారన్నారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ రూపొందించిన 'ఆరోగ్య సూచీ నివేదిక -2025' లో స్పష్టం చేసిందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ నివేదికలు చూస్తే వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, ఏవిధంగా రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందో స్పష్టమవుతోందన్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి, డబ్బును సక్రమంగా ఖర్చు చేయలేకపోగా.. అవినీతిలో కూరుకుపోయిందని తెలియజేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సీఎం నారా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేయడానికి, ఆదాయ వనరులను పెంచడానికి తీవ్రంగా కృషి చేస్తోందని తెలియజేశారు. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు మన రాష్ట్రానికి వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని సంతోషం వ్యక్తం చేశారు. గడచిన ఏడు నెలల్లో సుమారు రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా 4.10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆర్థిక వ్యవస్థ విధ్వంసం: టీడీపీ

వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం జరిగిందంటూ నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడించిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ చేసిన అప్పుల్లో ప్రధాన భాగం దుబారాకు, అనుత్పాదక రంగంలో వెచ్చించారన్నారు. దీనివల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎప్పుడూ లేనంత స్థాయిలో దిగజారిపోయిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలను ప్రజలకు సీఎం చంద్రబాబు తెలియజేస్తే.. వైసీపీ నేతలు ఆ మాటలను వక్రీకరించి సూపర్ సిక్స్ పథకాలను ఇవ్వలేమని చెప్పారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి సీఎంను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కరుణాకరరెడ్డి తిరుపతిలో ఏ స్థాయిలో దోపిడీ చేశారనేది ప్రజలకు తెలుసన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. నేతలు మోహన్‌రాజ్, శశికర్ బాబు, గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితమనేసరికి నదిలోని ఇసుకను ఊడ్చేస్తారా?

నగరిలోని కుశస్థలీ నదిలో ఇదీ పరిస్థితి


నదిలో ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఇసుక

నగరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితమని చెప్పింది. దీంతో నగరిలో ఉన్న కుశస్థలీ నదిలోని ఇసుకను ఊడ్చేస్తున్నారు. ఈ ఇసుకను ఎవరు.. ఎక్కడికి.. ఏపనికి తీసుకెళుతున్నారన్న సమాచారం కూడా లేదు. తమిళనాడుకు బారెడు దూరంలో నగరి ఉండటంతో ఇసుక అక్రమ రవాణాకు సులువవుతోందన్న విమర్శలున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలకు ఇసుక అంటూ అక్కడ డంప్ చేసి.. ఇసుకను తమిళనాడుకు తరలించేవారు. రాష్ట్రంలో ప్రస్తుతం గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదు.. కేవలం సిమెంటు రోడ్లు మాత్రమే వేశారు. మరి రోజుకు 60 నుంచి 70 వాహనాల్లో నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం, సత్రవాడ, ఢెరణిల వద్ద గల కుశస్థలీ నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇటీవల రెండు, మూడు సార్లు డంప్ చేసిన ఇసుకను పోలీసులు సీజ్ చేసి.. రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

అక్రమ రవాణాను ఇలా అడ్డుకోవచ్చు

ఇసుకను ఏ పనికి తీసుకెళుతున్నారు.. ఎక్కడికి తీసుకెళుతున్నారు.. ఏ వాహనం తీసుకెళుతోంది అన్న అంశాలను నమోదు చేస్తే అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఇందుకోసం నది వద్ద ఒక్కో రోజు తలారి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిని ఏర్పాటు చేసి రికార్డు నమోదు చేయాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇసుకను దోచుకుంటున్నారని నగరిలోని ఓ వాట్సాప్ తమిళం గ్రూపులో కొందరు కామెంట్లు చేయడం గమనార్హం.

పేటమిట్టలో నేడు పశువైద్యశాల ప్రారంభం

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కూడా..

పూతలపట్టు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం తలుపులనేనివారిపల్లె (పేటమిట్ట) గ్రామంలో బుధవారం పలు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు సర్పంచ్ గల్లా రాధాకృష్ణమ నాయుడు తెలిపారు. పేటమిట్టలో రాజన్న ఫౌండేషన్ ద్వారా రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన పశువైద్యశాల, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అమరరాజా సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

చిత్తూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన ప్రొవిజినల్ జాబితాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో జాబితా ఉంటుందని, అభ్యంతరాలుంటే ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు చిత్తూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహిళా టీచర్‌కు తీవ్రగాయాలు

భర్తతో బైక్‌పై వెళుతుండగా శునకం అడ్డురావడంతో ప్రమాదం

గంగాధరనెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ మహిళా టీచర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు గ్రామానికి చెందిన సుభాష్ చంద్రబోస్ గుడిపాల ఎంపీడీవో ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయన భార్య సుధామయి గంగాధరనెల్లూరు (సర్విరెడ్డిపల్లె బస్టాప్ వద్ద) గల బాలికల గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి గురుకుల పాఠశాల నుంచి దంపతులిద్దరూ బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డుపై గంగాధరనెల్లూరు మండలం కండ్రిగ కూడలికి సమీపంలోకి వచ్చేసరికి శునకం అడ్డురావడంతో అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఈప్రమాదంలో సుధామయికి తీవ్ర గాయాలవగా, సుభాష్‌చంద్రబోస్‌కి స్వల్పంగా గాయపడ్డారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య


రమేష్ బాబు మృతదేహం

పాలసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చదువుల ఒత్తిడి భరించలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పాలసముద్రం ఎస్ఐ చిన్న రెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. గంగమాంబపురం పంచాయతీ బలిజ ఊరు గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు రమేష్ బాబు(15) తిరుమలరాజపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువులో వెనుకబడి ఉండటంతో తాను బడికి వెళ్లనని తల్లిదండ్రులకు చెప్పాడు. అందుకు వారు పదో తరగతి పూర్తిచేయమని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి వద్దనే ఉరి వేసుకున్నాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా తమిళనాడులోని షోలింగర్ ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోటపల్లిలో ఒంటరి ఏనుగు..!

మామిడి చెట్ల ధ్వంసంతో రైతుల ఆందోళన


ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు,జనవరి28(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద మంగళవారం వేకువజామున ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. పంచాయతీ సరిహద్దులోని అటవీ ప్రాంతం నుంచి కోటపల్లిలోని రైతు రామచంద్రకు చెందిన మామిడితోటలోకి ప్రవేశించి 7 మామిడిచెట్లను విరిచేసింది. అనంతరం సమీపంలోని పలువురు రైతుల మామిడితోటల్లో కొమ్మలను విరుచుకుంటూ చింతలవంక అటవీ ప్రాంతం వైపు వెళ్లింది. మామిడిచెట్లకు మందులు పిచికారీ చేస్తున్న సమయంలో ఒంటరి ఏనుగు సంచారంతో రైతులు మామిడి తోటల్లోకి వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు.

సర్వేయర్ సంతకం ఫోర్జరీ

ఒకరి భూమిని మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనం - బాధిత రైతు ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు

గంగాధరనెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయం సర్వేయర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ సర్టిఫికెట్ తయారు చేసుకున్నారు. దాని సాయంతో ఒకరి భూమిని మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇది తెలిసి బాధిత రైతు ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం మహదేవమంగళంకు చెందిన సోమచారి కుమారుడు పట్టాభి ఆచారికి గ్రామంలో సర్వేనెంబరు 226లో కొంత భూమితోపాటు అందులోని బావి వారసత్వంగా వచ్చింది. అయితే ఈ భూమి అదే గ్రామానికి చెందిన కన్నయ్యరెడ్డి భార్య రంగమ్మ పేరుతో అనుభవంలో ఉన్నట్లు గ్రామ సచివాయ సర్వేయర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి.. ఓ సర్టిఫికెట్ తయారు చేసుకున్నారు. ఈ సర్టిఫికెట్ సాయంతో రంగమ్మ తన కుమారుడు శంకర్‌రెడ్డికి మొదటగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించింది. ఆ తర్వాత శంకర్‌రెడ్డి గ్రామంలోని సంజీవి మొదలి కుమారుడు నటరాజ్ మొదలికి రిజిస్ట్రేషన్ చేయించాడు. 2024 డిసెంబరు 21, 24 తేదీల్లో ఈ రెండు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు పట్టాభి ఆచారికి ఇటీవల తెలిసింది. దీంతో ఆయన సచివాలయ సర్వేయర్ గుణశేఖర్‌ను కలిసి విచారించగా.. తాను సర్టిఫికెట్ ఇవ్వలేదని, సంతకం కూడా తనది కాదని ధ్రువీకరించాడు. ఈ విషయమై బాధితుడు జిల్లా ఉన్నతాధికారులకు, గంగాధరనెల్లూరు పోలీసులకు, చిత్తూరు రూరల్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ రెండు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేసినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో మహదేవమంగళంకు చెందిన నటరాజ్‌మొదలి, రంగమ్మ, శంకర్‌రెడ్డి, మహదేవమంగళం దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం, బుక్కాపట్నం గ్రామానికి చెందిన గంగాధరరెడ్డి, తవణంపల్లె మండలం ఎం.జి.పల్లెకు చెందిన భాస్కర్ (చిత్తూరు డాక్యుమెంట్ రైటర్)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు. సర్వేయర్ కూడా తన సంతకం ఫోర్జరీ చేసినట్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఫోర్జరీ సంతకంపై గత తహసీల్దార్‌ను విచారించిన పోలీసులు

చిత్తూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీపై తాలూకా పోలీసులు విచారణను వేగవంతం చేశారు. గత తహసీల్దార్ కళావతిని మంగళవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విచారించారు. ఈ కేసులో ఇంత వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, ఇప్పటివరకు ఐదారుగురిని విచారణ చేసినట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే అరెస్టులు జరగనున్నాయని సమాచారం.

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టండి: కలెక్టర్


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటక రంగానికి అనుకూలమైన, అవకాశాలు ఉన్న ప్రాంతాలు గుర్తించి భూసేకరణ ప్రక్రియలపై రెవెన్యూ అధికారులతో టూరిజం శాఖ సమన్వయం చేసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో ఉపాధి పథకం కింద మంజూరైన రోడ్లు వేయడానికి అనుకూలంగా ఉన్నది, లేనిది పరిశీలించాలన్నారు. కుప్పం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా ననియాల ఎకో టూరిజం, మల్లప్ప కొండలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే వారిని గుర్తించాలని చెప్పారు. జేసీ విద్యాధరి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్, పర్యాటక శాఖ ఆర్ఎం రమణ, ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి మల్లికార్జున, డీఎం మల్లికార్జున, చిత్తూరు కమిషనర్ నరసింహప్రసాద్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించండి

మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు సెంట్రల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారులు ప్రతి నెలా నాలుగు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు గుర్తించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పథకాల అమలుపై జేసీ విద్యాధరితో కలిసి ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలు, స్కూల్స్, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, సచివాలయాలు, కార్యాలయాలన్నింటినీ పరిశీలించడం ద్వారా సిబ్బంది పనితీరు అంచనా వేయవచ్చని చెప్పారు. లోపాలు గుర్తించి, సరిచేసే వీలుందన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, ఉద్యానశాఖాధికారి మధుసూదన్, డీఎల్‌డీవో రవికుమార్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసులు, వీడియోకాన్ఫర్స్ ద్వారా పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు పాల్గొన్నారు.

అమరరాజా దాతృత్వం మరువలేనిది


శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే మురళీమోహన్, గల్లా రామచంద్రనాయుడు తదితరులు

తవణంపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అమరరాజా దాతృత్వం మరువలేనిదని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మంగళవారం తవణంపల్లె మండలంలోని దిగువమాఘంలో రాజన్న ట్రస్ట్ సౌజన్యంతో రూ.25కోట్లతో నిర్మించిన అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటరును ట్రస్టు చైర్మన్ గల్లా రామచంద్రనాయుడితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే అమరరాజా పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. గల్లా రామచంద్రనాయుడు అమరరాజా సంస్థలను ఏర్పాటు చేసి, జిల్లాలో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు, ఎందరికో ఉపాధి కల్పించారన్నారు. రాజన్న ట్రస్ట్ ద్వారా రూ. 218 కోట్లు వెచ్చించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూడా వీరిదేనన్నారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రశంసనీయమని చెప్పారు. దిగువమాఘం సెంటర్లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్‌కి సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న ట్రస్ట్ నిర్వాహకులు రాళ్లపల్లి సతీష్, డీన్ రవికుమార్, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నళినీకుమార్, శేఖర్, ధనంజయనాయుడు, ప్రిన్సిపాల్ జయశ్రీ, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసకందాయంలో తిరుపతి కార్పొరేషన్ రాజకీయం

- డిప్యూటీ మేయర్ వైసీపీ అభ్యర్థిగా శేఖర్ రెడ్డి!
- కూటమితో టచ్‌లో ఆ పార్టీ కార్పొరేటర్లు
- రెండు రోజుల్లో కూటమి అభ్యర్థి ఎంపిక

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయరు ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ ఇవ్వడంతో తిరుపతి కార్పొరేషన్ రాజకీయం రసకందాయంగా మారింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ ఎం.శేఖర్ రెడ్డిని ప్రకటించినట్లు తెలిసింది. ఈ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున డుమ్మాకొట్టినట్లు సమాచారం. కౌన్సిల్లో పాలకపక్షంగా ఉన్న వైసీపీకి సొంత పార్టీ కార్పొరేటర్లే తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 3న పరోక్ష పద్ధతిలో జరగనున్న ఎన్నికలకు ముందు క్యాంప్ రాజకీయాలకు తెరలేపనున్నట్టు సమాచారం. సమావేశానికి హాజరుకానివారిని స్థానికవైసీపీ నాయకత్వం ఇప్పటికే గట్టిగా హెచ్చరికలు జారీచేసినట్టు తెలుస్తోంది. అవన్నీ పట్టించుకోకుండా కూటమి పార్టీ నేతలతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోవైపు, కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తివున్న కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడినట్టు తెలుస్తోంది. నేడో, రేపో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి వస్తున్నట్టు సమాచారం. ఈలోపు కూటమిలో చేరేందుకు ఆసక్తి ఉన్న కార్పొరేటర్లతో పాటు ప్రస్తుతం వైసీపీతో అసమ్మతిగా ఉన్నవారిని ఏకం చేసి మంత్రి సమక్షంలో కూటమిలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పుడే కూటమి నుంచి డిప్యూటీ మేయర్‌ను ఎవరిని నిలబెట్టాలనే నిర్ణయాన్నీ తీసుకోనున్నారు. మొత్తానికి రాబోయే ఐదురోజుల పాటు తిరుపతి రాజకీయం రంజుగా ఉండబోతోంది.


గంగమాంబాపురంలో దాడి


కార్వేటినగరం పోలీసుస్టేషన్ వద్ద లోకనాథరెడ్డి వర్గీయుడు (పసుపు చొక్కా వ్యక్తి)కత్తితో మహేష్‌పై దాడికి పాల్పడుతుండగా అడ్డుకుంటున్న చెంగ్రాయరెడ్డి తదితరులు

గంగమాంబాపురంలో ఉద్రిక్తత

జనసేనలో చేరిన వైసీపీ నేత అరాచకం

టీడీపీ యువనేతపై దాడి


గాయపడిన మహేష్ - మహేష్ వర్గీయుడు

వెదురుకుప్పం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె పంచాయతీ గంగమాంబాపురంలో మంగళవారం ఉద్రిక్తత రాజ్యమేలింది.వైసీపీ నుంచి ఇటీవల జనసేనలో చేరిన లోకనాథ రెడ్డి, టీడీపీ నాయకుడు మహేష్ మధ్య భూ ఆక్రమణ తొలగింపు విషయమై గొడవ జరిగి గంగమాంబాపురంతో పాటు కార్వేటినగరంలోనూ ఉద్రిక్తత నెలకొంది.

అసలేం జరిగిందంటే...

గంగమాంబాపురానికి చెందిన వైసీపీ నేత లోకనాథ రెడ్డి గతంలో గ్రామ సమీపంలోని ముక్కరవానిపల్లె రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 202/5లో 3.78 ఎకరాల భూమిని ఆక్రమించుకుని చెరకు సాగు చేశాడని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.రికార్డుల ప్రకారం గుట్ట పోరంబోకు భూమిగా ఉన్న ప్రాంతంలో కబ్జాకు పాల్పడ్డాడని అప్పటి వీఆర్వో నరసింహారెడ్డి కూడా మండలస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై పలుసార్లు గంగమాంబాపురం గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్వే నంబరు 202/5లో విస్తీర్ణం 0.89 సెంట్లు మాత్రంగానే చూపించి, ఇది ప్రభుత్వ స్థలమని, ఎవరైనా ప్రవేశిస్తే శిక్షార్హులని రెవిన్యూ శాఖ హెచ్చరిక బోర్డులో పెట్టింది. కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయం నుంచి 2024 జూలై 20వతేదిన సీనంబరు:95/2024ప్రకారం ఓ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇందులో ముక్కరవానిపల్లె సర్వేనంబరు మొత్తం విస్తీర్ణం 3.78 ఎకరాలు(గుట్టపోరంబోకు) అని చూపించారు. అలాగే సర్వే నంబరు 202/6లో 1.53 ఎకరాలు రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి అని సర్టిఫికెట్‌లో చూపించారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నాయకుడు మహేష్‌రెడ్డి, గ్రామస్తులు ఆ ఆక్రమణపై ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ లోపు లోకనాథరెడ్డి జనసేన పార్టీలో చేరిపోయారు.ఈ క్రమంలో ఆక్రమణకు గురైన భూమి వద్దకు మంగళవారం తహసీల్దార్ నాగరాజు సిబ్బందితో వెళ్లారు. ఆ సమయంలో భూమి వద్ద లోకనాథ రెడ్డి, అతని వర్గీయులు కూడా ఉన్నారు. మహేష్‌కి రెవెన్యూ వర్గాల నుంచి పిలుపు అందడంతో అక్కడికి వెళ్లారు. దీంతో రెచ్చిపోయిన లోకనాథరెడ్డి సహా అతని వర్గీయులు మహేష్‌పై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు.ఒక దశలో లోకనాథరెడ్డి వర్గీయుడు కారుతో తమపై దాడికి పాల్పడ్డారని మహేష్ తెలిపారు. అక్కడి నుంచి కార్వేటినగరం పోలీసుస్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. గాయపడిన వారు చికిత్స నిమిత్తం పుత్తూరుకు, తిరుపతికి వెళ్లారు. అయితే లోకనాథరెడ్డి వర్గీయుడు ఒకరు కార్వేటినగరం పోలీసుస్టేషన్ వద్దకు కత్తితో వచ్చి మహేష్‌పై దాడికి పాల్పడే ప్రయత్నం చేశాడు. గమనించిన కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షుడు చెంగ్రాయ యాదవ్, మరి కొందరు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కార్వేటినగరంలోనూ ఉద్రిక్తత నెలకొంది.

సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం : చల్లా



చల్లా రామచంద్రారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

రొంపిచెర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సమస్యలకు తక్షణ పరిష్కారం ఉంటోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లె, చిచ్చిలివారిపల్లె, పెద్దగొటిగళ్లు పంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయనకు విన్నవించారు. విద్యుత్తు సరఫరా, తాగునీరు, ఉపాధి పనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆదర్శ పాఠశాల తరగతి గదుల నిర్మాణాలు ఆగిపోయాయని పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, చెంగల్‌రెడ్డి, రఘునాథ, పులిచెర్ల నాయకులు కొండా మురళి, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

నాగబాబు పర్యటన విజయవంతం చేయాలి



కందూరులో జనసేన నాయకుల ప్రచారం

సోమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో వచ్చేనెల 2న జనసేన నాయకులు కొణిదెల నాగబాబు పర్యటన జయప్రదం చేసేందుకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ ప్రచారం చేపట్టారు. మంగళవారం సోమల, కందూరు, సూరయ్యగారిపల్లె తదితర గ్రామాల్లో నాగబాబు పర్యటనపై ప్రచారం చేశారు. సోమల హైస్కూల్ ఆవరణలో బహిరంగ సభకు జనసేన అభిమానులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హరినారాయణ, రఘు, మురళీ, విజయ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు, జవవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వచ్చేనెల 1 నుంచి జరిగే మహాసభల పోస్టరను మంగళవారం పలమనేరు సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మహాసభలకు సీపీఎం కేంద్ర కార్యదర్శి బృందాకారత్, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర సీపీఎం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, సభ్యులు రాజా, ఈశ్వర, జయంతి, ధనమ్మ, సరోజమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ చావడికి మోక్షం..!

● వినియోగానికి తహసీల్దారు చర్యలు



చెత్తాచెదారం తొలగింపును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇన్నసాథన్

పలమనేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామ చావడిని వినియోగానికి తీసుకొస్తున్నట్లు తహసీర్ ఇన్ననాథన్ తెలిపారు. మంగళవారం గ్రామ చావడి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. రూ.కోట్లు విలువ చేసే రెవెన్యూ గ్రామ చావడిని దశాబ్దకాలంగా వినియోగించకపోవడంతో చావడి ఆవరణ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. పలమనేరు మున్సిపల్ ప్రజాప్రతినిధులు కొందరు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఈ గ్రామ చావడి స్థలాన్ని తీసుకొనేందుకు గతంలో ప్రయత్నించారు. అయితే అందుకు పలమనేరు ఆర్డీవో అభ్యంతరం చెప్పడంతో మిన్నకుండిపోయారు. మంగళవారం ఈ సందర్భంగా తహసీల్దారు ఇన్ననాథన్ మాట్లాడుతూ ఇలాంటి చారిత్రాత్మక స్థలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రెవెన్యూపై ఉందన్నారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తహసీల్దారు తీసుకుంటున్న చర్యలపై స్థానికులు అభినందిస్తున్నారు.

ఎరువుల నిల్వల్లో తేడాలొస్తే కఠిన చర్యలు



తనిఖీలు చేస్తున్న ఏడీఏ నాగపద్మిని

గంగవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో నిల్వల్లో తేడాలున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని హెచ్చరించారు. మంగళవారం గంగవరం సొసైటీలోని ఎరువుల కేంద్రం, నాలుగురోడ్ల సర్కిల్‌లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఏడీఏ ఆకస్మిక ంగా తనిఖీలు నిర్వహించారు. పురుగుమందులు, విత్తనాల నాణ్యతలను పరిశీలించారు. నాణ్యత కలిగినవి మాత్రమే విక్రయించాలని, ప్రభుత్వం సూచించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని తెలిపారు. తనిఖీల్లో ఏవో హేమలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం



చికిత్సలు అందిస్తున్న డాక్టర్ దినేష్‌రెడ్డి

చౌడేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దినేష్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని మేకలవారిపల్లె, మాదవంవారిపల్లెల్లో ఉచిత పశువైద్య చికిత్స శిబిరాలు నిర్వహించారు. 350 పశువులు, 160 దూడలు, 600 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల వడ్డెర సంఘం ఏకగ్రీవం



నూతనంగా ఎంపికైన వడ్డెర సంఘం సభ్యులు

చౌడేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల వడ్డెర సంఘాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పుంగనూరు నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల అధ్యక్షులుగా మాజీ ఎంపీటీసీ వెంకట రమణ, ఉపాధ్యక్షుడిగా జయకుమార్, ప్రధాన కార్యదర్శిగా చిన్నరెడ్డప్ప, కార్యదర్శిగా దాము, కోశాధికారిగా కాటమన్న, కార్యవర్గ సభ్యులుగా మునిచంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, వెంకరమణ, శ్రీరాములు, శీనప్ప, నరసింహులు తదిరులు పాల్గొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. నగరి ఏడీఏ సౌభాగ్య లక్ష్మి, టీఏ యామిని కుప్పం పురపాలక సంఘంతోపాటు మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, నిల్వ రికార్డులను పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ అప్‌డేట్ కాకపోవడం గమనించి వెంటనే వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఉన్న స్టాకుకు, రిజిస్టర్‌లోని లెక్కలకు ఏమాత్రం తేడా ఉన్నా.. నకిలీ ఎరువులు, మందులు విక్రయించినా లైసెన్సు రద్దుచేసి స్టాక్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. కుప్పం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.పయాజ్ ఈ తనిఖీలలో పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో దిగుబడులు

సోమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని చౌడేపల్లె ఉద్యానశాఖాధికారిణి సంతోషి కుమారి తెలిపారు. మంగళవారం సోమల లోని పలు గ్రామాల్లో పర్యటించి మామిడి తోటలను సందర్శించారు. రైతులకు పూత కాలంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. వాతావరణంలో అధిక చల్లదనంతో పూత ఆలస్యం జరుగుతుందన్నారు. పూత అనంతరం మొగ్గదశలో ఆశించే చీడపీడల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పుంగనూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో మరో రెండు మద్యం దుకాణాలు మంజూరు చేసిందని.. వచ్చేనెల 5వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు పరిధిలోని కల్లుగీత కులస్తులకు ఒకటి ఈడిగ కులస్తులకు ఓ దుకాణం కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 5తేదీ లోపు ఆన్‌లైన్ల దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 7న ఉదయం 10 గంటలకు చిత్తూరులోని దొడ్డిపల్లె సమీపంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు.

అపరిచితులపై జాగ్రత్తగా ఉండాలి

సోమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని.. అనుమానంగా గ్రామాల్లో తిరిగే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని సోమల ఎస్ఐ శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నంజంపేట, కందూరు గ్రామాల్లో ఆయన పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, నాటుసారా అమ్మకాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఐక్యంగా ఉంటూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలన్నారు. యువత ఆన్‌లైన్ గేమ్స్ మోజులో పడకుండా ఉండాలని సూచించారు.

186 రైతుల వినతులకు పరిష్కారం

రొంపిచెర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజల నుంచి వచ్చిన 186 వినతులు పరిశీలించి పరిష్కరించామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కార్యాలయానికి రైతులు చేరుకొని పలు సమస్యలపై తహసీల్దారుకు విన్నవించారు. రెవెన్యూ సదస్సుల్లోని సమస్యలను పరిష్కరిస్తున్నామని.. రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

సంచార జాతులకు ప్రభుత్వ పథకాలు



సంచారజాతులకు అవగాహన కల్పిస్తున్న ఆ సంఘం ప్రతినిధులు

బైరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంచార జాతులకు ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూర్చాలని సంచార జాతుల సంఘం ప్రతినిధులు కోరారు. ఇందులో భాగం గా మంగళవారం కైగల్ గ్రామంలో సీడ్ కమిటీలతో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, పక్కాగృహాలు, భూమిలేని నిరుపేదలకు భూములు, ఉచిత విద్యుత్, పింఛన్లు, రేషన్‌కార్డులతో పాటు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం సంచార జాతులకు చేయూతనందించాలని విన్నవించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలాజీ మండల, పంచాయతీ స్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న గృహనిర్మాణాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, ప్రభుత్వ భవనాలు, పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీలో కబ్జాల జోరు..!

● విచ్చలవిడిగా విక్రయాలు ● గుట్టలనూ వదలని అక్రమార్కులు

● స్థలాలు కాపాడాలని బీసీ ఫ్రంట్ నాయకుల వినతి



గంటావూరు ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాన్ని చదును చేసిన కబ్జాదారులు



కబ్జాపై తహసీల్దార్ ఇన్నసాథన్‌కు ఫొటోలతో వివరిస్తున్న గోవిందస్వామి

పలమనేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు గంటావూరు ఇందిరమ్మ కాలనీలో మళ్లీ కబ్జాల పర్వం మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ కాలనీలోని స్థలాలను కొందరు కబ్జా చేసి బాహాటంగా విక్రయాలు సాగించారు. ఇందిరమ్మ కాలనీలో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు వీలుకాకుండా అధికారులు విడిచిపెట్టిన గుట్టలను సైతం చదును చేసి కొందరు లక్షలాది రూపాయలకు నివేశ స్థలాలను విక్రయించారు. ఈ అక్రమ స్థలాల విక్రయాలపై పలుమార్లు పత్రికల్లో వచ్చినా.. సాక్షాత్తు జిల్లా కలెక్టరే అక్రమ స్థలాల విక్రయాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అప్పట్లో డీఆర్వో స్థాయి అధికారిని ఆదేశించారు. అయితే అప్పట్లో స్థలాల విక్రయాలపై రెవెన్యూలోని కొందరు ఉద్యోగుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో గంటావూరు కాలనీలో అక్రమాలపై అధికారులు ఎలాంటి విచారణ లేకుండా అక్రమాలకు అండగా నిలిచారు. కబ్జాదారుల నుంచి బాగా ఆర్థికంగా లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు నెలల పాటు దూరంగా ఉన్నప్పటికీ తాజాగా కబ్జాదారులు రంగంలోకి దిగారు. కాలనీలో రౌడీయిజం చేస్తూ ఈ స్థలాల కబ్జాలకు పాల్పడుతున్నారు. కాలనీలో లేఅవుట్ వేసి పేదలకు నివేశ స్థలాలు ఇచ్చినప్పటికీ నేడు లేఅవుట్‌కు ఏమాత్రం పొంతన లేకుండా ఖాళీగా ఉన్న స్థలాలు అన్యాక్రాంతం చేస్తున్నారు. ఈ గంటావూరు కాలనీ ద్వారానే విద్యుత్ లైన్ వెళ్తోంది. దీంతో కాలనీ ఏర్పాటుచేసిన సందర్భంగా రెవెన్యూ అధికారులు హెచ్‌టీ లైన్ వెళ్లే ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగితే లైను కింద నివశించే పేదలకు ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుందని భావించారు. దీంతో హెచ్‌టీ లైన్ కింద ఎవరికీ పట్టాలు ఇవ్వకుండా ఆ స్థలం ఖాళీగానే ఉంచారు. అయితే అటువంటి స్థలాలను సైతం కబ్జాదారులు అన్యాక్రాంతం చేసి లక్షలాది రూపాయలు సొమ్ముచేసుకొన్నారు.

నాయకుల సమీప బంధువే సూత్రధారి

గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువే అక్రమ పట్టాలు తయారు చేసి విక్రయించారు. ఈ సంఘటన గతంలో వెలుగు లోకి వచ్చినప్పటికీ అధికారులు విచారణ పేరుతో హంగామా చేసి కబ్జాదారులు, అక్రమ పట్టాలు తయారు చేసి స్థలాలు విక్రయించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో నేడు కొందరు కబ్జాదారులు స్థలాలను యథేచ్ఛగా విక్రయాలు చేసేందుకు పూనుకుంటున్నారు. దీనిపై మంగళవారం స్థానిక బీసీ ఫ్రంట్ నాయకుడు గోవిందస్వామి తహసీల్దారు ఇన్ననాథన్‌ను కలిసి ఫొటోలతో పాటు స్థలాల విక్రయాలకు కబ్జాదారులు చదును స్థలాలను చూపించారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ విక్రయాలను అడ్డుకొని కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న సీఈవో రవికుమార్

కల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్ తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, సూపరింటెండెంట్ మునిరాజును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశానికి ఇన్‌చార్జి ఎంపీడీవో, సూపరింటెండెంట్ ఎందుకు గైర్హాజరయ్యారని ప్రశ్నించారు. తన కుటుంబ సభ్యుల అనారోగ్యం సరిలేదని అత్యవసరంగా సెలవు పెట్టానని ఎంపీడీవో తెలిపారు. ఇకపై ఒకే రోజు ఇద్దరూ సెలవు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

బైరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ కుష్ఠువ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే ఆస్పత్రిలో నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, పోషకాహార ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: కుష్ఠు, క్షయ వ్యాధుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కుష్ఠు, క్షయ వ్యాధి నివారణ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు పవన్‌కుమార్, పూజిత, నవీన్, డీపీఎంవో దేవదాస్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సహకరించండి



తహసీల్దార్ హనుమంతుకు వినతి పత్రం అందిస్తున్న మత్స్య సంఘం సభ్యులు

చౌడేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి సహకరించాలని తహసీల్దార్ హనుమంతుకు మత్స్యకారుల సంఘం సభ్యులు మంగళవారం విన్నవించారు. గంగపుత్ర బెస్తసేవా అభివృద్ధి సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని కాటిపేరిలో చేపల పెంపకానికి వనరులు అనువుగా ఉన్నాయన్నారు. చేపల పెంపకం కోసం ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, సురేష్, వేణుగోపాల్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏపీవో మురుగేషన్‌కు సన్మానం



ఏపీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఉపాధి సిబ్బంది

పెద్దపంజాణి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఏపీవోగా ఎంపికై గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న పెద్దపంజాణి ఏపీవో మురుగేషన్‌ను మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బంది సన్మానించారు. ఎంపీడీవో బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీగంధం దుంగల స్వాధీనం

కల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో మంగళవారం రాత్రి ఓ కారుతో సహా సుమారు 40 కిలోల శ్రీగంధం దుంగలను పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురు ప్రభాకర్‌కు అందిన రహస్య సమాచారం మేరకు ఆయన ఆదేశాలతో పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళ్లే జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కారును గుర్తించి వెంబడించారు. దీంతో కల్లూరు పట్టణంలోని ఎగువవీధిలో వదిలిపెట్టి పరారయ్యారు. అటవీశాఖ సిబ్బంది కారు వద్దకు చేరుకొని తనిఖీ చేయగా సుమారు 40 కేజీల శ్రీగంధం దుంగలున్నట్లు గుర్తించారు. కారును స్వాధీనం చేసుకొని పీలేరు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. దాడుల్లో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రతాప్, నందీశ్వర, సుబ్రహ్మణ్యం, సురేష్ పాల్గొన్నారు.

నేడు సోమల మండల సర్వసభ్య సమావేశం

సోమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో 29న బుధవారం సోమల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో భార్యాభర్తలు గాయపడిన సంఘటన మంగళవారం పుంగనూరు సమీపంలో జరిగింది. రామసముద్రం మండలం నారిగానిపల్లెకు చెందిన దాసప్ప, భార్య గంగులమ్మ(60) ద్విచక్రవాహనంలో వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికుల సాయంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా భార్య పరిస్థితి విషమించడంతో మదనపల్లెకు తరలించారు.

దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసి గాయపరిచారంటూ మంగళవారం ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. పట్టణ సమీపంలోని నక్కబండలో కాపురం ఉన్న రవి కుమారుడు సురేష్(20), కమతంపల్లెకు చెందిన నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరూ ట్రాక్టర్లతో సింగిరిగుంట సమీపంలో ఇటుకలను తరలిస్తూ ఘర్షణ పడ్డారు. ఘర్షణలో నాగరాజు సురేష్‌పై దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన సురేష్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సైకిల్‌పై జ్యోతిర్లింగాల యాత్ర



సైకిల్‌పై జ్యోతిర్లింగాల యాత్రకు వెళుతున్న సత్యప్రకాష్

బైరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఇటావా జిల్లా షేకుపర్ జొకొల్లి గ్రామానికి చెందిన సత్యప్రకాష్ శంక్వార్ (55) సైకిల్‌పై జ్యోతిర్లింగాల యాత్ర చేపట్టి మంగళవారం బైరెడ్డిపల్లెకు చేరుకున్నారు. గత ఏడాది జూన్ 24వ తేదీ తమ స్వగ్రామం నుంచి సైకిల్‌పై బయలుదేరానని.. ఇప్పటికే ఉత్తరాఖండ్, నేపాల్, జార్ఖండ్, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చినట్లు సత్యప్రకాష్ చెప్పారు. తనకు ఎప్పటి నుంచో సైకిల్‌పై జ్యోతిర్లింగాల దర్శనానికి వెళ్లాలనే ఆసక్తి ఉండటంతో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మరో 8 నెలలు దేశమంతటా పర్యటించి తమ స్వగ్రామానికి చేరుకుంటానని తెలిపారు.

అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్ల ప్రతిభ



పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా పురుషుల జట్టు



తృతీయ స్థానంలో నిలిచిన మహిళల జట్టు

పుంగనూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సీనియర్ కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం చోడవరం అంకుపాలెం గ్రామంలో కబడ్డీ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. మహిళా జట్టు తృతీయస్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మాధవమూర్తి, పీడీ రామచంద్ర వారికి అభినందనలు తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిళ్లతో రైతు కుటుంబం

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ సిబ్బంది మొక్కలెలా తొలగిస్తారు?
తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత రైతు కుటుంబం ఆవేదన
పెట్రోల్ బాటిళ్లతో బైఠాయింపు

శ్రీరంగరాజపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ముందస్తు సమాచారం ఇవ్వకుండా మా పొలంలోని మొక్కలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. న్యాయం చేయకుంటే మాకు ఆత్మహత్యే శరణ్యం' అంటూ ఓ దళిత రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ సిబ్బంది తొలగించిన మొక్కలను, పెట్రోల్ బాటిళ్లు తీసుకొచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం దళితవాడకు చెందిన వెంకటేష్.. సర్వే నెంబరు 179/1లో 94 సెంట్లు, సర్వే నెంబరు 179/3లో రెండెకరాల నాలుగు సెంట్ల భూమిని 22 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. ఇందులో మామిడి, టేకు మొక్కలు నాటాడు. అయితే ఎటువంటి సమాచారం లేకుండానే తన భూమిలో పెంచుతున్న మామిడి, టెంకాయ, ఇతర మొక్కలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారని వెంకటేష్ ఆరోపించాడు. సిబ్బంది తొలగించిన మొక్కలను, పెట్రోల్ నింపిన బాటిళ్లు తీసుకొచ్చి కుటుంబీకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులొచ్చి బాధితులకు సర్దిచెప్పి అక్కడినుంచి పంపించేశారు. ఈ అంశంపై తహసీల్దార్ లోకనాథం పిళ్లైని వివరణ కోరగా.. వెంకటేష్ తన అనుభవంలో ఉన్న భూమి కంటే ఎక్కువ ఆక్రమించుకున్నాడని పాతపాళ్యం గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అక్కడినుంచి వచ్చిన ఆదేశాలతో తమ సిబ్బంది చెట్లను తొలగించారని చెప్పారు.

హైరోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కమిషనర్


సిబ్బందితో మాట్లాడుతున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న హైరోడ్డు విస్తరణ పనులను కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించారు. మంగళవారం దేవదాయ శాఖకు సంబంధించిన స్థలాలను శుభ్రం చేసే పనులు నిర్వహించారు. మొత్తం 14 పనులకు సంబంధించిన నిర్మాణాలను తొలగించే పనులను పరిశీలించి.. అధికారులకు సూచనలిచ్చారు. మార్కింగ్ చేసిన మేరకు నిర్మాణాల తొలగింపును వేగవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, దేవదాయ శాఖ, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి: డీఎస్పీ


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

నగరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతానియమాలు పాటించాలని ప్రజలకు నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచించారు. 36వ జాతీయరోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీలో సుమారు 80 మందికిపైగా హెల్మెట్ ధరించి పాల్గొన్నారు. సీఐ మహేశ్వర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి హాజరయ్యారు.

భక్తులకు సమయానికి ప్రసాదం అందించండి

- వరసిద్ధుడి ఆలయ ఈవో


పరిచారికకు సూచనలు ఇస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానంతరం వెలుపలకు విచ్చేసే భక్తులకు అందించే ఉచిత ప్రసాదాన్ని సమయానికి అందించాలని ప్రసాద పంపిణీ పరిచారికకు ఈవో పెంచలకిషోర్ సూచించారు. మంగళవారం ఉదయం ఆయన ఆలయంలో భక్తుల సౌకర్యాలను పరిశీలిస్తూ.. ఉత్తర ద్వారం వద్ద భక్తులకు పంపిణీ చేస్తున్న ప్రసాదాన్ని రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్కో రోజు ఒక్కో ప్రసాదాన్ని అందించాలని చెప్పారు. ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సేవలో ప్రభుత్వ విప్: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ నాయకర్ దర్శించుకున్నారు. ఆయనతోపాటు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు.

ఏఆర్ విభాగం పోలీసుశాఖకు వెన్నెముక: ఏఎస్పీ

చిత్తూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ విభాగం పోలీసు శాఖకు వెన్నెముక వంటిదని ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ అన్నారు. ఏఆర్ పరేడ్ మైదానంలో వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ.. పది రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పరేడ్ మూవ్‌మెంట్స్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, సెక్యూరిటీ వింగ్‌పై పునః సమీక్షించడమే కాకుండా నిష్ణాతులుగా తయారవ్వడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల్లేకుండా తరలిపోతున్న గ్రావెల్

- మహారాజపురంవాసుల ఆరోపణ

విజయపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో నిర్వహిస్తున్న క్వారీ నుంచి రాత్రి వేళలో బిల్లుల్లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని చెప్పారు. అధిక లోడుతో వాహనాలు నడపడం వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు పరిసర ప్రాంతాల్లో గ్రావెల్‌కు డిమాండ్ ఉండడంతో అక్కడికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణల బారిన ప్రభుత్వ భూములు

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

పాలసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీవీఎన్ఆర్ పురం గ్రామానికి సమీపంలో నరసింహాపురం చెరువుపక్కన ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజులుగా ఆక్రమణదారులు రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో చదునుచేస్తున్నారని తహసీల్దార్ అరుణకుమారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించడంతో పశువులు మేపుకోవడానికి ఇబ్బంది అవుతుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా నరసింహాపురం పంచాయతీలో ఎలాంటి పట్టాలు తీసుకోకుండానే ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని మామిడి మొక్కలు పెట్టి సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం చెరువుకు ఆనుకుని ఉండే సుమారు 50 ఎకరాలభూమిని చదును చేసుకున్నారని, చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.


నరసింహాపురంలో అక్రమంగా చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

పీఈటీకి కలెక్టర్ అభినందన


సురేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఈనెల 13 నుంచి 19వ తేదీవరకు మొట్టమొదటి వరల్డ్ కప్ ఖోఖో పోటీలకు టెక్నికల్ అఫిషియల్‌గా వ్యవహరించిన పీఈటీ సురేష్‌ను కలెక్టర్ సమిత్ కుమార్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ వరల్డ్ కప్‌లో 24 దేశాలకు చెందిన స్త్రీ, పురుష ఖోఖో క్రీడా జట్లు పాల్గొన్నట్లు డీఎస్‌డీవో బాలాజీ కలెక్టర్‌కు వివరించారు.

'డైట్'లో అధ్వానంగా పారిశుధ్యం


పాచి పట్టిన తాగునీటి ట్యాంకు, వృథాగా పోతున్న నీరు


నీటి కుంటను తలపిస్తున్న ఆవరణం


తాగునీటి కొళాయిల వద్ద పరిస్థితి

వెదురుకుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఆవరణం నీటి కుంటలను తలపిస్తోంది. తాగునీటి ట్యాంకుకు పాచిపట్టింది. నీరు వృథాగా పోతోంది. కొళాయిల వద్ద కూడా పారిశుధ్యం లోపించింది. డైట్‌కు కార్వేటినగరం నుంచి వెళ్లే రహదారి కూడా అధ్వానంగా ఉంది.

మార్చి 15లోగా పూర్తి చేయండి

యాదమరి - గుడియాత్తం రోడ్డు పనులు

అధికారులకు కలెక్టర్ ఆదేశం - ఎమ్మెల్యేతో కలిసి పనుల పురోగతిపై పరిశీలన


రోడ్డు పనుల పరిశీలనలో ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - గుడియాత్తం రోడ్డు పనులను మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో కలిసి పనుల పురోగతిని మంగళవారం ఉదయం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్, ఆర్అండ్‌బీ నిధులు రూ.7.20 కోట్లతో గత నెలలో ప్రారంభించిన పనులు.. దాదాపు 50శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. మరింత వేగంగా పనులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా భూమిరెడ్డిపల్లె, కీనాటంపల్లె, పచ్చాపూరు మురుగన్ టెంపుల్ రోడ్డు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఈశ్వర్, టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, జనసేన కుమార్, నాయకులు హేమగిరి, వల్లేరు అమర్‌నాథ నాయుడు, సుభాష్ నాయుడు, గోపి గౌడ్, నిత్యానంద, రాజమాణిక్యం, పట్టాభి, బెల్లంకొండ కార్తిక్, సతీష్ నాయుడు, మునీర్, గుణశేఖర్, కాంట్రాక్టర్ సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

అంగన్వాడీకొచ్చే పిల్లల బరువును పరీక్షించాలి

గంగాధరనెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు బరువు, ఎత్తు పెరుగుదలను ప్రతినెలా పరీక్షించాలని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ అన్నారు. గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు గ్రోత్ మానిటరింగ్ పరీక్షించే విధానంపై సూపర్‌వైజర్లతో కలిసి సీడీపీవో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత, బిందుమాలతి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



యాదమరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు త్యాగరాజులు నాయుడు సహకారంతో ఎస్టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను వితరణ చేశారు. హెచ్ఎం కె.లలిత, జిల్లా సాక్షరతా సమితి సూపర్‌వైజర్ కందేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టించుకోండి


190 రామాపురం సీఎంసీ వద్ద కోసుకుపోయిన మట్టి

గుడిపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 190 రామాపురం సీఎంసీ వద్ద హైవే అధికారులు రోడ్డు వెడల్పు చేశారు. ఇందుకోసం రోడ్డు పక్కన పోసిన మట్టి కోసుకుపోయింది. దీనివల్ల రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : కలెక్టర్

యాదమరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బందితో సమీక్షించారు. సచివాలయ సిబ్బంది రోజూ ఉదయం తప్పక బయోమెట్రిక్ విధానంలో హాజరు వేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదుల్లో పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవాటి వివరాలపై కచ్చిత సమాచారం ఇవ్వాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిబ్రవరిలో మళ్లీ తనిఖీలకు వస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి ఫొటోలు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, డీటీ జయంతి, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వోలు సురేష్, వేలాయుధం, కార్యదర్శులు, ప్రకాష్, దీపా, అంజుమ్, నాగరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశు ఆరోగ్య వైద్య శిబిరాలు


నర్రావూరులో జరిగిన శిబిరంలో జేడీ ప్రభాకర్ తదితరులు

యాదమరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్రావూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్, డీడీ డాక్టర్ ఆరీఫ్ పాల్గొని పాడిపశువులకు సంక్రమించే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి, టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, అమర్‌నాథ్ నాయుడు, నిత్యానంద, ధనయ్య, పాడిరైతులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఉడమలకుడితి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఈకి సన్మానం



చిత్తూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకున్న చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్రను మంగళవారం ఉద్యోగులు, సిబ్బంది, సామాజిక సేవా కార్యకర్త పార్థసారథినాయుడు సత్కరించారు. డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన దొంగలు



చిత్తూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్బీఐ కాలనీ వద్ద వాకింగ్ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు. వన్ టౌన్ సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. ఎస్బీఐ కాలనీలో నివాసం ఉంటున్న మల్లికార్జున, సరళ దంపతులు మంగళవారం రాత్రి వాకింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి సరళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు. బంగారు గొలుసు సుమారు 23 గ్రాములు ఉంటుందని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

40 కిలోల శ్రీగంధం స్వాధీనం

కల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో మంగళవారం రాత్రి సుమారు 40 కిలోల శ్రీగంధం దుంగలను పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురు ప్రభాకర్‌కు అందిన రహస్య సమాచారంతో పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళ్లే జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కారును గుర్తించి వెంబడించారు. కారును దుండగులు కల్లూరు పట్టణంలోని ఎగువవీధిలో వదిలేసి, పరారయ్యారు. అటవీశాఖ సిబ్బంది వాహనాన్ని పరిశీలించగా, సుమారు 40 కిలోల శ్రీగంధం దుంగలున్నట్లు గుర్తించారు. కారుతోపాటు దుంగలను స్వాధీనం చేసుకుని, పీలేరు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. దాడుల్లో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రతాప్, నందీశ్వర, సుబ్రహ్మణ్యం, సురేష్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ


బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన దుస్తులు

గంగాధరనెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు(దిగువూరు)కు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి కొన్నేళ్లుగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబీకులతో కలిసి అప్పుడప్పుడు గంగాధరనెల్లూరులోని ఇంటికి వచ్చి రెండు, మూడ్రోజులు ఉండి వెళతారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని దుండగులు భానుప్రకాష్‌రెడ్డి ఇంటి తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం వీరింటికి ఎదురుగా ఉండేవారు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి బెంగళూరులోని భానుప్రకాష్‌రెడ్డికి ఫోన్‌చేశారు. అలాగే పోలీసులకు తెలపగా ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి రాత్రి వచ్చి ఇంటిని పరిశీలించారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో లోపలికెళ్లారు. ఇంట్లోని బీరువా కూడా పగులగొట్టి ఉండటంతో క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి సీఐ మాట్లాడుతూ.. ఇంట్లో కొంత బంగారం, వెండి, నగదు ఉందని భానుప్రకాష్‌రెడ్డి ఫోనుద్వారా తెలియజేశారన్నారు. బాధితులొచ్చి ఫిర్యాదు చేశాక వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

సంక్షిప్తంగా..

తహసీల్దార్‌కు సన్మానం

గుడిపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసలు అందుకున్న చంద్రశేఖర్ రెడ్డిని మంగళవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలాజీ నాయుడు, మాజీ అధికార ప్రతినిధి (దివ్యాంగుడు) తుమ్మల సాంబశివనాయుడు సత్కరించారు. మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్, టీడీపీ నాయకులు శేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులపై నిఘా పెట్టండి

గుడిపాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా అనుమానితులుంటే వారిపై నిఘా ఉంచి.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హైస్కూల్ ఆవరణంలో ఎక్కడైనా విద్యార్థినులను ఈవ్‌టీజింగ్ చేసినా, గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తున్నా పోలీసులకు తెలియజేయాలన్నారు.

దుప్పట్ల వితరణ

చిత్తూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు మంగళవారం సామాజిక సేవా కార్యకర్త పార్థసారథి నాయుడు దుప్పట్లు వితరణ చేశారు. రాత్రిపూట చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వంద మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు, కుమారగిరిపై వెలసిన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి, కోదండ రామస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

భూసార పరీక్షలు చేసుకోండి

బంగారుపాళ్యం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయ ఏడీఏ విజయశంకర్ రెడ్డి సూచించారు. మంగళవారం చీకూరుపల్లె, కల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ఏఈవో సాదరయ్య, వీహెచ్‌లు కోకిల, మూర్తి, అనిల్, సాయిజ పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమతరు కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇరువారం బాలత్రిపుర సుందరి దేవి ఆలయంలో మంగళవారం సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ప్రేమతరు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 101 మొక్కలు నాటారు. సత్యసాయి భజనమండలి, బాలవికాస్, మహిళామండలి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో పూజలు

బంగారుపాళ్యం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిపల్లె దళితవాడలోని ఓంశక్తి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఓంశక్తి భక్తుల జిల్లా అధ్యక్షురాలు సరిత, గురుశక్తి గోవిందయ్య పాల్గొన్నారు

అనాథకు అంత్యక్రియలు


అనాథకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న అమ్మఒడి నిర్వాహకులు

చిత్తూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అమ్మఒడి ఆశ్రమం నిర్వాహకులు మంగళవారం ఓ అనాథకు అంత్యక్రియలు చేశారు. గాంధీ విగ్రహం వద్ద ఓ అనాథ మహిళ మృతి చెందింది. విషయం తెలియడంతో ఆశ్రమ నిర్వాహకులు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.